# ఎల్లమ్మ తెల్లరూపాయి

ఎల్లమ్మ అలా కళ్ళప్పగించి చూస్తోంది.

"ఊఁహూ! మిగల్చడు. అరెరె! ఆ గుప్పెడు మెతుకులు కూడా దులుపుకుంటు న్నాడే! కడుపాత్రపు వెధవ." మనసులోనే అనుకుంది.

ఎల్లమ్మ అనుకున్నట్టే జరిగింది.

సూర్యనారాయణ టిఫిన్ క్యారియర్‌లోవున్న ఆ కొద్దిపాటి అన్నాన్ని కూడా విస్తట్లోకి వంచుకొని ముద్దచేసి మింగేశాడు. అది చూస్తూ నిల్చున్న ఎల్లమ్మకు గుండెకాయ ఎక్కడకో ఎగబాకినట్టయింది. ఇవ్వాళ పొద్దుటినుంచి పంతం పట్టి కూర్చున్న ఎల్లమ్మకు సూర్యనారాయణ చేసిన ఆ పని చిరాకునే కలిగించింది.

'ఎల్లమ్మా! నీ జీతం రేపిస్తాలే. ఇవ్వాళ జీతాలు పడవు. క్యారియర్ తీసుకెళ్ళు' అన్నాడు సూర్యనారాయణ విస్తరి చుట్టి కిందకు గిరాటువేస్తూ.

'డబ్బులెక్కడికి పోతాయి బాబూ!' అన్నది ఎల్లమ్మ. కాని ఆ నిముషంలో రావలసిందేదో చెయిజారిపోయినట్టే అన్పించింది.

'ఎల్లమ్మా! ఇవ్వాళ గిన్నెలో మెతుకులు మిగలకుండా తినేశాను. దరిద్రుడికి ఆకలి ఎక్కువ అన్నట్టుంది నా పని.' చెయ్యి కడుక్కుంటూ అన్నాడు సూర్యనారాయణ అదోలా నవ్వుతూ.

"అదేంటి బాబూ! మిగిలితే మాత్రం నేనేం చేసుకుంటాను?" తెచ్చిపెట్టుకున్న ఆశ్చర్యాన్ని కనబరుస్తూ అన్నది ఎల్లమ్మ.

సూర్యనారాయణ గతుక్కుమన్నాడు.

"ఏదో బతికి చెడ్డ మనిషిలా వుంది" అనుకున్నాడు.

ఎల్లమ్మ ఒక్కొక్కటే ఆరు టిఫిన్ క్యారియర్లు తట్టలోకి సర్దుతోంది. తట్ట నెత్తిన పెట్టుకొని మేడమెట్లు దిగి రోడ్డుమీదకు వచ్చింది. తట్టలోవున్న ఖాళీ క్యారియర్లు ఆమె అడుగుతీసి అడుగు వేసినప్పుడల్లా పరస్పరం కూడబలుక్కుంటూ మర్మరధ్వనులు చేస్తున్నాయి.

"ఎల్లమ్మ కివ్వాళ రూపాయి బిళ్ల చేతిలో పడదు... ఎల్లమ్మ కివ్వాళ... రూపాయి... పడదు..." ఆ ధ్వనులు వింటుంటే ఎల్లమ్మకు అవి తనను ఎగతాళి చేస్తున్నట్టుగా అన్పించసాగింది.

"ఏడ్చారు. మీ ముఖాలు కాల్చా!" అని గొణుక్కుంది ఎల్లమ్మ.

'రూపాయి బిళ్ళ కళ్ళ చూడకపోతేనేం? కడుపాత్రపు సూరిగాడు మెతుకులు

మిగల్చుకపోతేనేం? రమణయ్య బాబూ, నాగేశ్వరరావు బాబూ... ఇంకా... నా మతిమండిపోనూ? ఆ బాబు పేరు గుర్తురాదేం? వాళ్ళందరూ గిన్నెల్లో బాగానే మిగిల్చారు. ఎట్టా లేదన్నా మూడు పావలాలు చేతిలో పడ్తాయి. చాలు. చాలకెందుకూ...' అంటూ గొణుక్కుంటూ నడుస్తున్నది ఎల్లమ్మ.

ఎల్లమ్మకు ఈమధ్య ఈ గొణుగుడు బాగా ఎక్కువవడమే కాకుండా, వంటికి కూడా జీర్ణించుకుపోయింది. హారన్ కొట్టకుండా పక్కనుంచి దూసుకుపోయే కార్ల గురించీ, ఎక్కడో దూరంగా మొరిగే కుక్కల గురించీ, ఎల్లమ్మ ఇలా గొణుక్కుంటూనే వుంటుంది.

ఎల్లమ్మకు, బతుకును ఈడ్చేందుకు నెత్తిమీద తట్టలో బరువుగా వున్న ఆ టిఫిన్ క్యారియర్లే ఆసరా ఇస్తున్నాయ్.

ఎల్లమ్మ ఎక్కడ పుట్టిందీ?

ఎలా పెరిగిందీ?

ఈ యాభయ్యో పడిలో ఇలా మద్రాసు ఎందుకు చేరిందీ? అని ఎవరైనా ఆమెను అడిగితే ఆమెనుంచి జవాబు చస్తే దొరకదు.

మెడలో ఇంతపాటి-చింతాకుపాటి ప్రమాణంలో ఏదో మంగళసూత్రంలాంటిది ఒకటి మెరుస్తూ వుంటుంది. అయినా ఆమె ఒంటరిగానే, పాతమాంబళంలో, కూల డానికి సిద్ధంగా వున్న గుడిసెలో వుంటున్నది. మొగుడు బతికే వుండొచ్చు. తన్ని తరిమేసి వుండొచ్చు. కొడుకూ వుండొచ్చు. గడప తొక్కితే కాళ్ళిరగ గొడ్తానని కొడుకు అని వుండొచ్చు. బహుశా కూతురు వుండి వుండొచ్చు. ఇంటి ఛాయలకు వస్తే ముఖంమీద కళ్ళాపి నీళ్ళు కొడ్తానని వుండొచ్చు.

అందుకే పాతమాంబళంలోని ఆ జీర్ణ కుటీరం ఆమె నివాస స్థానమై వుండాలి.

రోజూ ఒంటిగంటకల్లా ఎగ్మూరులోని బ్యాంకులో పనిచేసే గుమాస్తాలకు క్యారియర్లలో భోజనాలు అందిస్తూ వుంటుంది. ఆమె బ్రతుకు దీనిమీదే ఆధారపడి వుంది. వాళ్ళందరూ కలిసి మాంబళంనుంచి ఎగ్మూరుకు ఎలక్ట్రిక్ ట్రైన్ టికెట్ కొనిస్తారు. క్యారి యర్ ఒకింటికి రెండు రూపాయలు చొప్పున ఆరు క్యారియర్లు మోసుకొస్తూ వుంటుంది. నెలకు పన్నెండు రూపాయలు... ఆపైన...

ఇక్కడే ఎల్లమ్మను తీరని సమస్యలు చుట్టుముడ్తూ వుంటాయి. రోజూ ఎగ్మూరు స్టేషన్లో రైలెక్కి, తట్టలోని ఖాళీ క్యారియర్లను-కొత్త-పాత మాంబళంలో ఎవరిది వారికిచ్చేవరకూ ఆమెకు అన్నీ సమస్యలే. అంతూ పొంతూ లేని ఆలోచనలు-ఒకటే ఆలోచనలు-

ఈరోజూ అంతే జరిగింది.

ఇవ్వాళ ఏమైనా సరే తెల్లటి రూపాయి కళ్ళ చూడాలనుకొన్నది నిద్ర మంచంమీదనుంచి లేస్తూనే. అలా ఎందుకనుకున్నదో ఆమెకే తెలియదు.

"ఊహూ! అలా అనుకోకూడదు. పాపిష్టిదాన్ని" అని చెంపలు వేసుకుంది.

మళ్ళీ అంతలోనే 'ఇవ్వాళ అందరూ రోజూకంటే ఎక్కువ అన్నమే వదిలేస్తారు' అనుకొన్నది.

ఆ సూర్యనారాయణ బాబు అసలే పిట్ట మెతుకుల మనిషి. ఇవ్వాళ అసలే అన్నం సహించకపోతే ఆశ్చర్యపడక్కర్లేదు. అవును! సహించదు. మొత్తం వదిలేస్తాడు. అసలు

తినలేడు. పొద్దుకూకిన తర్వాత మాంబళం స్టేషన్ దగ్గర ఆ అన్నమంతా ముద్దలుచేసి రిక్షా వాళ్ళకు అమ్ముతుంది. తేలిగ్గా ఈరోజు తెల్ల రూపాయి కళ్ళ చూడొచ్చు.

ఇలా అనుకోవడం 'పాపం' అనుకొంటూనే, అనుకోకుండా వుండలేకపోతున్నది. మళ్ళీ మళ్ళీ అనుకున్నది.

అదేం పాపమో! ఇవ్వాళ ప్రతివాళ్ళూ రోజూకంటే ఒక ముద్ద ఎక్కువే తిన్నారు. ఇక ఆ సూర్యనారాయణ సరే సరి! కరువు వచ్చినట్టు ఆఖరి మెతుకులుకూడా తుడుచుకొని మరీ తిన్నాడు.

ఎవరి క్యారియర్లు వాళ్ళ కప్పగించి ఎల్లమ్మ గుడిసె చేరింది. పాతగుడ్డలో జాగ్రత్తగా మూటగట్టిన సాంబారు, రసాలతో తడిచివున్న అన్నం విప్పి చూసింది.

ఊంహూ! అంతా కలిపినా పది అణాలుకూడా వస్తయ్యో రావో! తను పొద్దున వండుకుతిన్న అన్నం కొంత రాత్రికి మిగుల్చుకున్నది. తను దరిద్రురాలే కావచ్చు. కాని వాళ్ళూ వీళ్ళూ మిగిల్చిన అన్నం తినాలంటే చెడ్డ అభిమానంగా అన్పిస్తుంది. అసహ్యం కూడా కలుగుతుంది.

ఈమధ్య తన దగ్గిర అన్నం ముద్దలు కొనడానికి వచ్చే రిక్షావాళ్ళకూ, తిరుగుబోతులకూ కూడా గోటు ముదురుతోంది. "ఎంగిలి మెతుకులు... సద్దికూడు" అని ముఖంమీదే అనేస్తున్నారు.

"సచ్చినోళ్లు. కొందరు అరవంలో పెద్దపెద్దగా ఏదోదే అంటారు. ఆ కీసర బాసర, తికమక అసలే తనకు అర్థం అయి చావదు."

ఆం అళగమ్మ... ఆ పేరే తనకు చోద్యంగా విన్పిస్తూంది... తన కెదురుగా పోటీ బేరం పెట్టింది, మంచి వయసులో పిటపిటలాడుతూ వుంటుంది. ఇంతకుముందు తన దగ్గర ముద్దలు కొనుక్కునేవాళ్లు చాలామంది ఇప్పుడు దాని దగ్గర తింటున్నారు. తన కంటే ఎక్కువేం పెట్టదు. పైగా ఆ నీళ్ళోడే సద్ది మెతుకులే వాళ్ళ ముఖాన వేస్తుంది. అయితేనేం? వయసులో వుందిగా? కళ్ళు తిప్పుతూ, ఎకసెక్కాలాడుతూ, కిలకిల నవ్వుతూ, నవ్విస్తూ ముద్దలు తినిపిస్తుంది. ఆ సచ్చినోళ్ళు అందుకే అదంటే పడిచస్తారు. తను దానికి మల్లే కులకగలదా ఏం? తన వయసేమిటి? అ మాటకొస్తే వయసులో వున్నప్పుడు మాత్రం తను అలా చేసిందా ఏం?

సాంబారు, రసంతో తడిచి ముద్దగావున్న అన్నాన్ని, చిన్న చిన్న ముద్దలుచేసి బుట్టలో పెట్టుకొని, మాంబళం స్టేషన్ దగ్గరకెళ్ళి కూర్చుంది. అప్పటికే అళగమ్మ చుట్టూ నలుగురైదుగురు చింపిరి చొక్కాలవాళ్ళు చేరి నానా హంగామా చేస్తున్నారు. బహుశా అళగమ్మ స్వంతంగా వండి అన్నం బేరం చేస్తూందేమో అనుకొన్నది ఎల్లమ్మ అటు చూస్తూ.

తన కివాళ ఎలాగు తెల్ల రూపాయి కళ్ళచూసే యోగం లేదు. ఎదురుగా బుట్టలోవున్న ఐదు అన్నం ముద్దలను ఒక్కొక్కటే రెండు అణాల చొప్పున అమ్మితే... మొత్తం పదణాలు ముడతాయి. ఆ కొనేవాళ్ళలో కర్మం చాలక కొసిరేవాళ్ళు దాపరించారా... అంతే సంగతులు! అర్ధరూపాయికంటే ఎక్కువ రాదు.

"బేడకు కొనే అన్నం పెళ్ళకుకూడా గుణిసి చస్తారు ముష్టివెధవలు." అని గొణుక్కుంది ఎల్లమ్మ.

అలాంటి మనుషులంటే తనకు వళ్ళు మండిపోతుంది. తను మద్రాసు వచ్చిన

కొత్తలో... ఆ సంగతి ఆలోచిస్తే... మనసు కకావికలంగా అవుతుంది. మొదట్లో అయితే అన్నం అమ్ముకోవడం మహా పాపంలా అన్పించేది.

"ఆకలిగా వుంది."

ఎల్లమ్మ ఆలోచనా దారం పుటుక్కున తెగింది. చివ్వున తలెత్తి చూసింది.

'ఆకలిగా వుంది'– మళ్ళీ అని ఒక ఆడమనిషి ఎల్లమ్మ ఎదురుగా కూర్చుంది. ఆమె కట్టుకున్న వస్త్రానికి చీర ఆకారం లేదు. పీలికలు ముడిపెట్టి చుట్టుకున్నట్టుగా వుంది. సగం విరబోసుకొన్న జుట్టు. పాతికేళ్ళకంటే ఎక్కువ వుండవేమో అనిపించింది. చూస్తుంటే ఎల్లమ్మకు ఆ మనిషి పిచ్చిదేమోనన్న అనుమానం కలిగింది.

'ఆకలిగా వుంది... అన్నం...' ఆ స్త్రీ ఎల్లమ్మను చూస్తూ మళ్ళీ అడిగింది. ఆమె ఆయాసపడుతున్నట్టుగా వుంది.

"బేడదా? పావలాదా?" తనలో చెలరేగిన ఆలోచనలన్నింటినీ బేరంవైపుకు తిప్పుతూ అడిగింది ఎల్లమ్మ.

"ఆకలిగా వుంది. ఎంతోకంతకియ్యి." అంటూ ఆ స్త్రీ చెయ్యి చాపింది.

ఎల్లమ్మ బుట్టలోవున్న ఒక ముద్ద తీసి ఆమె చేతిలో పెట్టి 'బేడ' అన్నది.

ఆ స్త్రీ అమాంతం ముద్దంతా ఒకేసారి నోట్లో పెట్టుకుంది. పొలమారింది. మళ్ళీ సగం నోట్లోనుంచి చేతిలోని తీసుకుంది. వంచిన తల ఎత్తకుండా ఆత్రం ఆత్రంగా తిన్నది. మళ్ళీ చెయ్యి చాపింది.

"దీంతో పావలా." ఎల్లమ్మ మరో ముద్ద ఆమె చేతిలో పెట్టింది. ఆ ముద్దకూడా ఆత్రంగా మింగేసి మళ్ళీ చెయ్యి చాపింది. ఎల్లమ్మకు అప్పుడుగాని పిచ్చిదేమోనన్న అనుమానం దృఢపడలేదు.

"ముందు పావలా ఇట్టా పడేయ్." ఎల్లమ్మ చెయ్యి చాపింది.

'నేను పిచ్చిదాన్ని. డబ్బు సంగతి నాకు తెలియదు. ఇంకా ఆకలిగా వుంది. ఊఁ పెట్టు' అంటూ చెయ్యి చాపింది ఆ స్త్రీ.

ఎల్లమ్మకు నెత్తిన పిడుగు పడ్డట్టయింది. ఆ స్త్రీ పిచ్చిది కాదని గ్రహించింది. పిచ్చివాళ్లు తమకు పిచ్చి అని చస్తే ఒప్పుకోరు. తనను నిలువునా మోసగించి కడుపు నింపుకోవాలని చూస్తున్నది.

ఎల్లమ్మకు వళ్ళు తెలియని కోపం వచ్చింది.

"ముందు పావలా అక్కడ పెట్టు. కదిలావా డొక్క చీరేస్తాను. ఎవరనుకుంటు న్నావో"? అంటూ లేచి ఎల్లమ్మ ఆ స్త్రీ జుట్టు లంకించుకుంది.

కొద్దిక్షణాల్లోనే చుట్టూ జనం చేరారు. వాళ్ళల్లో చాలామంది అరవం మాట్లాడు తున్నారు. తలా ఒక ప్రశ్నా వేస్తున్నారు. ఎల్లమ్మకు ఏం చెప్పాలో తెలియడంలేదు. తెల్లరూపాయిని ఈరోజు ఎలాగైనా కళ్ళ చూడాలని మంకుపట్టు పట్టి పొద్దుటినుంచీ అదే ధ్యాసలో వున్న మనసును, పది అణాలతో బుజ్జగించాలని ప్రయత్నిస్తూంటే... అసలుకే ఎసరు పెట్టింది ఈ దొంగ పిచ్చిది.

"దీని తాడు తెగ. నాల్గుగణాల అన్నం తిని కూర్చుంది." గొణిగింది ఎల్లమ్మ.

చుట్టూ చేరినవాళ్లు ఏదేదో అంటున్నారు. ఒక్కమాటా ఎల్లమ్మ బుర్రకు ఎక్కడం లేదు.

"నా పావలా నా కివ్వు. లేకపోతే..."

"పోనియ్యవమ్మా! పాపం, పిచ్చిది." ఎవరో అన్నారు జనంలోనుంచి.

"అవును! పిచ్చిదే." మరొకడు తాళం వేశాడు.

"మహా బయలుదేరారు పెద్ద మనుషులు-తీర్పు చెప్పడానికి! నేను పిచ్చిదాన్నని చెప్పుకొనేది పిచ్చిదెలా అవుతుంది?" నిలదీసినట్టుగా అడిగింది ఎల్లమ్మ, చుట్టూ మూగిన జనాన్ని కొరకొర చూస్తూ.

'అది పిచ్చిదే' అంటూ ఓ నడికారు రిక్షావాడు జనాన్ని తోసుకొని వచ్చి ఎల్లమ్మ ముందు నిల్చున్నాడు.

'పిచ్చిదానికి ఆకలి వుంటుంది కామాలు?' బుగ్గ నొక్కుకుంటూ బోలెడంత ఆశ్చర్యాన్ని ప్రకటించింది పట్టుచీరలో వున్న ఓ నడివయసు ఆడమనిషి.

'ఆడదాన్ని ఆడదే ఆదుకోకపోతే ఎలా ఎల్లమ్మా' అన్నాడు రిక్షావాడు.

'దాని మొగుడు ఏ ఏట్లో కలిశాడూ?' అన్నది ఎల్లమ్మ పళ్ళు కొరుకుతూ.

'ఐతే నీ మొగుడో?' అన్నాడు రిక్షావాడు.

ఎల్లమ్మ చటుక్కున ఆ ఆడదాని జుట్టు వదిలేసింది.

ముఖం వెల తెలా పోయింది. నోట మాట రావడం లేదు. గొంతు తడి ఆరిపోతున్నది.

'అది పిచ్చిదే... అంటే ఆకలి పిచ్చిది. నెల్లూరి దగ్గరి ఎనుబోతులపాలెంనుంచి వచ్చింది. మొగుడు వదిలేశాడు. అన్నదమ్ములూ... వాళ్ళుకూడా...'

"ఎనుబోతులపాలెమా?" అయోమయంగా చూస్తూ అన్నది ఎల్లమ్మ.

"ఏం? అలా అయిపోయావ్?" అన్నాడు రిక్షావాడు.

ఎల్లమ్మ ఆ స్త్రీ పక్కగా కూర్చుంది చుట్టూ జనాన్ని కలయజూసింది.

'ఏమిటి చూస్తున్నారు చుట్టూమూగి? మీకు పనీ పాటా లేదా? వెళ్ళండి. నా డబ్బులు నా ఇష్టం. వసూలు చేసుకుంటే చేసుకుంటాను. లేకపోతే మానేస్తాను. మధ్యలో మీ సలహాలేంటి? బోడి సలహాలు! పోండి! పోండి!' ఎల్లమ్మ గట్టిగా అరిచింది.

'మరో పిచ్చిది.' అన్నాడు జనంలోనుంచి మోకాళ్ళ వరకూ లాల్చీ వేసుకొన్న ఓ యువకిశోరం.

ఎల్లమ్మ మౌనంగా వుండిపోయింది. ఆ స్త్రీకూడా ఎల్లమ్మను భయం భయంగా చూస్తూ కూర్చుంది. రిక్షావాడు ఇద్దర్నీ మార్చి మార్చి చూస్తున్నాడు.

జనం ఒక్కొక్కరే వెళ్ళిపోయారు.

రిక్షావాడు వాళ్ళకు కొంచెం దూరంగా రిక్షాలో కూర్చుని బీడీ ముట్టించాడు.

'మం... మంగయ్య నెరుగుదువా?' ఎల్లమ్మ చిన్నగా సాలోచనగా అడిగింది ఆ స్త్రీని.

"ఆc! ఎరుగుదును..."

"బాగున్నడా?"

'ఆమధ్యే చచ్చిపోయాడు. మంచంలోపడి తీసుకు తీసుకు చచ్చాడు.'

ఎల్లమ్మ ముఖం వెలా తెలా పోయింది. కళ్ళు మూసుకొని కొద్ది నిముషాలు, ఏదో గుర్తు చేసుకుంటున్నట్టుగా వుండిపోయింది.

కళ్లు తెరిచి, ఆ స్త్రీ ముఖంలోకి చూస్తూ "నీ మొగుడో?" అనడిగింది.

"ఆ సచ్చినోడు ఇంకా చావలేదు."

'మరి మంగళసూత్రం లేదేం?' బోసి మెడకేసి చూస్తూ అడిగింది ఎల్లమ్మ.

"తెంపుకొని తరిమేశాడు."

ఎల్లమ్మ రెండు చేతులతో తన మెడలోవున్న మంగళసూత్రం తాడు పుటుక్కున తెంపింది.

"ఇది కట్టుకో" చెయ్యి ముందుకు చాచి మంగళసూత్రం ఆ స్త్రీకి అందించింది. కాని ఆమె అందుకోలేదు. 'తీసుకో. కట్టుకో' అన్నది ఎల్లమ్మ.

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? మొగుడున్నాడుగా? బోసిమెడతో వుండకూడదు."

'మొగుడూ మొద్దులూ-ఏడుండాడు? ఆడు కట్టింది ఆడే తెంచేసుకున్నాడు. నేనెందుకు కట్టుకోవాలి?'

ఎల్లమ్మ తెల్లబోయి చూసింది. ఎల్లమ్మకు ఆమె అన్న మాటల్లో ఏదో లాజిక్కు వున్నట్టే తోచింది. 'నిజమేగా' మనసులోనే అనుకుంది.

'అది బంగారంది లాగుంది. అమ్మేసుకో. అన్నం ముద్దల యాపారానికి పనికొస్తది' అన్నది ఆ స్త్రీ.

"అవును. నిజమే. ఈ డబ్బుతో ఎంగిలి మెతుకులకోసం ఎదురుచూడకుండా అన్నంముద్దల యాపారం చెయ్యొచ్చు." ఎల్లమ్మ గొణిగింది.

అంతలోనే ఏదో గుర్తొచ్చినట్టు "ఇదిగో, ఈ కాస్త అన్నంకూడా తిను. బాగా ఆకలిమీదున్నావు" అని, బుట్టలో మిగిలిన అన్నం ముద్దలు ఆ స్త్రీ దోసిట్లో పెట్టసాగింది. ఆమె ఒక్కొక్క ముద్దే తింటున్నది.

'ఆ మంగయ్య నీకేమౌతాడు?' అంటూ రిక్షావాడు చేతిలోని బీడీ అవతల పారేసి, రిక్షా పైకెత్తాడు.

'ఏమీ కాడు.'

'మరి కొడుకు విస్సన్నో?'

'నీకేమన్నా పిచ్చా?' పిచ్చిగా అరిచింది ఎల్లమ్మ.

'అవును. పిచ్చే! ఆకలి పిచ్చి! తెలిసిన పిచ్చి! తెలియని పిచ్చి! రకరకాల పిచ్చులు...' అంటూ రిక్షావాడు రిక్షా లాక్కుంటూ రోడ్డెక్కాడు.

ఆ స్త్రీ లేచి నిల్చుంది.

"ఎక్కడి కెళ్తావ్?" అడిగింది ఎల్లమ్మ.

'ఏమో!'

'పద, నాతో వుందువుగాని. వయసులోవున్న ఆడదానివి ఎక్కడికని వెళ్తావు? ఇదమ్మి యాపారం చేద్దాం. నేను మాంబళం స్టేషన్‌లో అన్నం ముద్దలు అమ్ముతాను-నువ్వు బస్‌స్టాండులో అమ్ము. ఒకళ్ళ కొకళ్ళం తోడుగా పడివుందాం' అని ఎల్లమ్మ ఖాళీ బుట్ట ఆ స్త్రీ చేతికి ఇచ్చింది.

ఇద్దరూ ఎల్లమ్మ గుడిసెకేసి నడిచారు.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక - 1953)